ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 20.09.2025 సమయం.18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో న్యాయస్థానాలలో మౌళిక వసతుల కల్పన, సిబ్బంది నియామకం వంటి పలు అంశాల పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆపరేష్ కుమార్ సింగ్ తో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు చర్చించారు.
2. రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొనేందుకు ఎంత ఖర్చునైనా భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.
3. సిద్దిపేట జిల్లాలోని ఆయిల్ ఫామ్ పరిశ్రమను త్వరలో అందుబాటులోకి తెస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు.
4. రాష్ట్రవ్యాప్తంగా వచ్చే రెండు రోజుల్లో ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

…………………………………………….

**బతుకమ్మ**

రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు రేపు ప్రారంభమవుతాయి. ఇవి తొమ్మిది రోజుల పాటు కొనసాగుతాయి. ఈ నెల 28 వ తేదీన హైదరాబాద్ ఎల్ బి స్టేడియంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది.
హనుమకొండ లోని చారిత్రాత్మక వేయి స్తంభాల ఆలయం వద్ద రాష్ట్రస్థాయి బతుకమ్మ వేడుకలు రేపు ప్రారంభమవుతాయి. రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, ధనసరి అనసూయ సీతక్క ఈ వేడుకల్లో పాల్గొంటారని స్నేహ శబరీష్ చెప్పారు.

కాగా, బతుకమ్మ దసరా పండుగల సందర్భంగా ఈ రోజు నుంచి వచ్చే నెల 2 వ తేదీ వరకు ఆర్ టి సి 7 వేల 554 ప్రత్యేక బస్సులు నడుపుతోంది.

........డెస్క్ , పిటిసి వరంగల్

**యాదాద్రి ఇళ్ళు**

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ళ పనులను వేగవంతం చేసి త్వరలో లబ్ధిదారులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. ఆయన ఈ రోజు భువనగిరి మండలం, తుక్కాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళ పనులను పరిశీలించారు. అంతకుముందు అక్కడి ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు.అక్కడి భోజనం పారిశుద్ధ్యం పై సమీక్షించారు.

........పిటిసి యాదాద్రి భువనగిరి జిల్లా

**నల్లగొండ – పోషణ**

నల్లగొండ జిల్లాలో కొనసాగుతున్న పోషణ మాసం ఉత్సవాలలో భాగంగా గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లల పోషకాహారం పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. పాలిచ్చే తల్లులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని, పౌష్టికాహార పథకం కింద 100 రోజుల ప్రణాళిక రూపొందించాలని పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ నెల 17వ తేదీన ప్రారంభమయిన పోషణమాసం వచ్చే నెల 16వ తేదీ తో ముగుస్తుంది.

........పిటిసి, నల్లగొండ

**దసరా సెలవులు**

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు రేపటి నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించారు. జూనియర్ కళాశాలలకు ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు. ఈ సెలవుల్లో తరగతులు నిర్వహించరాదని, నిబంధనలను ఉల్లంఘించే విద్యాసంస్థల పై కఠిన చర్యలు ఉంటాయని విద్యాశాఖ హెచ్చరించింది.

**భట్టి**

రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొనేందుకు ఎన్ని కోట్లు ఖర్చు అయినా భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. వచ్చే ఐదేళ్ళలో కోటీ మంది మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చటమే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగా ప్రతి సంవత్సరం 20 వేల కోట్ల రూపాయలను వడ్డీ లేని రుణాలు అందించాలని నిర్ణయించినట్టు చెప్పారు. మొదటి సంవత్సరమే లక్ష్యానికి మించి 21 వేల 632 కోట్ల రూపాయలను రుణాలను అందజేశామని పేర్కొన్నారు. హైదరాబాద్ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఈ రోజు జరిగిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకట స్వామి, పొన్నం ప్రభాకర్, అనసూయ సీతక్క తో కలిసి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశారు. మహిళా సంఘాల ద్వారా బస్సులు కొనుగోలు చేసి ఆర్ టి సి కి లీజుకు ఇస్తున్నామని ఇప్పటివరకు 150 బస్సులను లీజుకు ఇవ్వగా మరో 450 బస్సులను లీజుకు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఉపముఖ్యమంత్రి చెప్పారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం హైదరాబాద్ శిల్పారామంలో వారికి 100 దుకాణాలను కేటాయించిందని ఆయన తెలియజేశారు.

......SDP

**కూరగాయల సాగు – గద్వాల**

గద్వాల జిల్లాలో సాధారణ పంటల సాగుకు అనుకూలంగా లేని ప్రాంతాల్లో కూరగాయల సాగుకు ఉద్యానవన శాఖ ముందుకు వచ్చిందని జిల్లా అధికారి అక్బర్ భాషా తెలిపారు. వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం కింద ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు మల్దకల్ మండలం, కుర్తిరావుల చెరువు గ్రామంలో ఏర్పాటైన అవగాహన సదస్సులో చెప్పారు. ఈ పథకం కింద కుర్తిరావుల చెరువు, శేషంపల్లి గ్రామాలను క్లస్టర్ లగా ఎంపిక చేసినట్టు ఆయన చెప్పారు.

.........పిటిసి, గద్వాల

**WEATHER:**

రాష్ట్రవ్యాప్తంగా వచ్చే రెండు రోజుల్లో ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్, భద్రాది కొత్తగూడెం, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదరుగాలులు వీస్తాయని తెలిపింది.

.....ప్రెస్ నోట్

**సిజె-సియం**

రాష్ట్రంలో న్యాయస్థానాలలో సంబంధించి మౌళిక వసతుల కల్పన, సిబ్బంది నియామకం వంటి అంశాల పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆపరేష్ కుమార్ సింగ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు చర్చించారు. కొత్త జిల్లాల్లో అవసరమైన చోట్ల న్యాయస్థానాలకు భవనాలు, మౌళిక వసతులు కల్పించడంతో పాటు సిబ్బంది నియామకం చేపట్టాలని ప్రధాన న్యాయమూర్తి ముఖ్యమంత్రిని కోరారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను అందజేశారు. ప్రాధాన్యత – ప్రాతిపదికగా ఈ సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, న్యాయ శాఖ కార్యదర్శి పాపిరెడ్డి జస్టిస్ పి.సామ్ కోశి, జస్టిస్ అభినంద్ కుమార్ షావలి సమావేశంలో పాల్గొన్నారు.

SDP/PN

**ఈ- సాక్షి పోర్టల్**

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సభ్యులకు అందజేస్తున్న నియోజకవర్గ అభివృద్ధి నిధులు వాటి వ్యయం, పథకాల అమలు మున్నగు అంశాలను సామాన్యులు తెలుసుకొనేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ఈ – సాక్షి అనే పోర్టల్ ను ప్రవేశపెట్టింది. దీనిపై హైదరాబాద్ లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో నిర్వహించిన వర్క్ షాప్ లో దక్షిణాది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అధికారులతో పాటు రాష్ట్రంలోని ముఖ్య ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన కేంద్ర ప్రణాళికా శాఖ డైరెక్టర్ రూపస్ దత్తం

మాట్లాడుతూ... నిధుల వినియోగం, పథకాల అమలు వంటి అంశాలను ప్రజా ఆర్థికా నిర్వహణ వ్యవస్థ (పిఎఫ్ఎమ్ఎస్) వ్యవస్థ ద్వారా మ్యాపింగ్ చేయడం, సందేహాలను నివృత్తి చేసుకోవడం అవకాశం ఉంటుందని తెలిపారు.

...........SDP/PN

**ఛైర్మన్:**

నాణ్యమైన కార్యక్రమాలతో ప్రజలకు చేరువ కావాలని ప్రసార భారతి ఛైర్మన్ నవనీత్ కుమార్ సెహగల్ దూరదర్శన్ అధికారులు, ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలను సమాచారంతో బలోపేతం చేసి, దేశ నిర్మాణంలో వారి పాత్రను పోషించేలా దోహదపడాలని సూచించారు. సెహగల్ ఈరోజు హైదరాబాద్ దూరదర్శన్ యాదగిరి కేంద్రాన్ని సందర్శించి, కేంద్ర కార్యకలాపాలను సమీక్షించారు. ఈ సందర్భంగా, కార్యక్రమాల నాణ్యతను పెంచడానికి ఛైర్మన్ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. యువత, మహిళలు రైతుల కోసం కార్యక్రమాల రూపకల్పనపై దృష్టి పెట్టాలనీ, ప్రేక్షకులను ఆకర్షించడానికి సరైన స్లాట్‌లను గుర్తించాలని సూచించారు. నాణ్యమైన కార్యక్రమాలతో కేంద్రం ఆదాయాన్ని కూడా పెంచాలని అన్నారు. వార్తల సేకరణ, ప్రసారంలో సాంకేతికతను మరింతగా ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రైవేట్ వార్తా ఛానెళ్లతో పోటీ పడే మార్గాలను అన్వేషించాలని కూడా సెహగల్ సిబ్బందికి సూచించారు. అంతకు ముందు, హిందీ పఖ్వాడా వేడుకల్లో పాల్గొన్న ఛైర్మన్, జీవితంలో రాణించాలంటే కనీసం మూడు భాషలు తెలుసుకోవాలని అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషలలో హిందీ ఒకటనీ, ఉద్యోగులు మాతృభాషతో పాటు హిందీ పై పట్టు సాధించాలన్నారు.

-----MSL

**మోదీ షార్ట్ ఫిలిం- కరీంనగర్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిన్ననాటి అనుభవాల పై రూపొందించిన లఘు చిత్రాన్ని కరీంనగర్ జిల్లా అల్గునూర్ కేంద్రీయ విద్యాలయంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా దీనిపై విద్యాలయ ప్రిన్సిపాల్ పంకజ్ కుమార్ ఆకాశవాణితో మాట్లాడుతూ....

**బైట్ .............**

.......పిటిసి, కరీంనగర్

**పోషణ్ – రాజన్న సిరిసిల్లా జిల్లా**

రాజన్న సిరిసిల్లా జిల్లాలోని అంగన్ వాడీ కేంద్రాలలో ఈ నెల 17 నుంచి పోషణ్ మాసోత్సవం జరుగుతోంది. ఈ సందర్భంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిపై శిశు అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి సౌందర్య ఆకాశవాణితో మాట్లాడుతూ....

**బైట్ ..........**

పిటిసి, రాజన్న సిరిసిల్లా

**KS శర్మ:**

ప్రసార భారతి మాజీ CEO K.S. Sarma ఈ రోజు హైదరాబాద్ లో తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 80 ఏళ్ళు. ఆంధ్ర ప్రదేశ్ క్యాడర్ IAS అధికారి అయిన KS శర్మ దూరదర్శన్ డైరెక్టర్ జనరల్ కొద్ది కాలం, ఆ తర్వాత ప్రసార భారతి CEO గా 2006 వరకు సేవలు అందించారు. దూరదర్శన్ డైరెక్ట్ టు హోమ్, DD డైరెక్ట్ ప్లస్ లాంటి సేవలను చేపట్టటంలో శర్మ కీలక పాత్ర పోషించారు. అప్పటి కరీంనగర్ జిల్లా కలెక్టర్ గా విశేష సేవలు అందించారు. తిరుమల, తిరుపతి దేవస్థానం ఎస్ వి బి సి భక్తి ఛానల్ కు కూడా సిఈవో గా సేవలందించారు. KS శర్మ గత కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

-----MSL

**ఆయిల్ పాం-తుమ్మల**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేటలో ఆయిల్ ఫామ్ పరిశ్రమ నిర్మాణ పనులు తుదిదశకు చేరాయని, మిగిలిన పనులు పూర్తయిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనిని ప్రారంభిస్తారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఈ పరిశ్రమ

రాష్ట్రానికే కాకుండా దేశంలోని రైతులకు మార్గదర్శకంగా ఉంటుందన్నారు. ఆయన ఈ రోజు ఆయిల్ పామ్ పరిశ్రమను పరిశీలించారు. ఈ పరిశ్రమ ద్వార వెలువడే పిప్పితో నాలుగు మెగావాట్ల విద్యుత్ ను ఉత్పత్తి చేయవచ్చన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.70 లక్షల ఎకరాల ఆయిల్ పామ్ సాగవుతోందని, ఈ సంవత్సరం మరొక లక్ష ఎకరాలు సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా 13 లక్షల ఎకరాల్లో ఈ పంట సాగవుతుంటే, రెండు తెలుగు రాష్ట్రాల్లోనే 10 లక్షల ఎకరాల్లో సాగవుతోందని మంత్రి వివరించారు. ఆయిల్ పామ్ గెలలు అమ్మిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాలో డబ్బు జమవుతుందని చెప్పారు.

**సౌండ్ బైట్**

పీటీసీ... సిద్దిపేట

**వర్షాలు – ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ జిల్లాలో ఈ మధ్యాహ్నం కురిసిన భారీవర్షం కారణంగా పలుచోట్ల వాగులు పొంగి ప్రవహించటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. జిల్లా కేంద్రం నుంచి మండలం కేంద్రం తిర్యాణి మధ్య కాలువ పొంగి ప్రవహించటంతో పాటు రాకపోకలు గంటల తరబడి అంతరాయం కలిగింది.

........... పిటిసి, ఆసిఫాబాద్

**మంజీర బ్యారేజ్**

సంగారెడ్డి జిల్లా, కులబ్ గూర్ సమీపంలోని మంజీరా బ్యారేజ్ ని పర్యాటక కేంద్రంగా, పర్యావరణ పరిరక్షణ విద్యా కేంద్రంగా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. ఇందుకు సంబంధించి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యారేజ్ వద్ద గల వన్య మృగాల సంరక్షణ కేంద్రాన్ని ఈ రోజు పరిశీలించారు. వ్యర్థ జలాలను శుద్ధి చేయడానికి ఏర్పాటు చేసిన చిన్న చెరువును ఆమె పరిశీలించారు.

.....పిటిసి, సంగారెడ్డి